


## మాజీ సర్పంచ్ మనుమడికి కేసీఆర్‌గా నామకరణం

ఇచ్చోడ, ఫిబ్రవరి 15 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా(కే) మాజీ సర్పంచ్ గాడ్గె మీనాక్షి-సుభాష్ దంపతుల మనుమడికి మాజీ సీఎం కేసీఆర్ పేరును నామకరణం చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ.. ముక్రా(కే) గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే ఆదర్శ గ్రామంగా నిలిపిన మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు సదా రుణపడి ఉంటామని తెలిపారు. కేసీఆర్‌తోనే ముక్రా(కే) గ్రామం దేశంలోనే అభివృద్ధిలో నంబర్ వన్‌గా నిలిచిందని కొనియాడారు. ఈ సందర్భంగా గాడ్గే వైష్ణవి-ధీరజ్‌కు జన్మించిన కుమారుడికి కేసీఆర్ బర్త్‌డేను పురస్కరించుకొని కేసీఆర్‌గా నామకరణం చేసినట్టు చెప్పారు. చివరి వరకు కేసీఆర్ వెంటే ఉంటామని, ఆయన అడుగుజాడల్లో నడుస్తామని వారు పేర్కొన్నారు.

## లోకం పోకడ




అదా? దాన్ని ఒకప్పుడు నీళ్ల కోసం వాడేవారు.. ఇప్పుడు నిరసనల కోసం వాడుతున్నారు కన్నా!

### • వృక్షార్చన పోస్టర్ ఆవిష్కరణ..



మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు పురస్కరించుకొని శనివారం ఓయూలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి వృక్షార్చన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. - ఉస్మానియా యూనివర్సిటీ

### • కేసీఆర్‌కు బహుమతిగా వృక్షార్చన



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని శనివారం మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి. - నర్సాపూర్



### వనపర్తి జిల్లా కొత్తకోటలో ..

వనపర్తి జిల్లా కొత్తకోటలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మొక్కలు నాటారు. కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని వారికి బహుమతిగా వృక్షార్చన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు వారు తెలిపారు. - కొత్తకోట

### • మొక్కలు నాటి.. సెల్ఫీ దిగి..



కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని శనివారం వరంగల్‌లోని ఉర్సులో వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మొక్కలు నాటి సెల్ఫీ దిగారు. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటి వృక్షార్చన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. - కరీమాబాద్

### • గజ్వేల్ క్యాంపు కార్యాలయంలో..



కేసీఆర్ బర్త్‌డే వేడుకలను పురస్కరించుకొని శనివారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో వృక్షార్చనలో భాగంగా మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి. - గజ్వేల్

# గిరిజనుల ఉపాధికి పైసల్లేవట!

- నిలిచిపోయిన గిరిజన సహకార సంస్థ కార్యకలాపాలు
- 30 కోట్ల అభివృద్ధి నిధులు అవసరమన్న అధికారులు
- ప్రభుత్వ సహకారం కోసం గిరిజన సంఘాల నిరీక్షణ
- కొత్త బడ్జెట్‌లో అయినా కేటాయించాలని డిమాండ్



హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): అటవీ ఉత్పత్తులను సేకరించి, ప్రాసెస్ చేసి, మార్కెట్లోకి విక్రయించడం ఆదాయం సమకూర్చడం కోసం, గిరిజనులకు అండగా నిలిచేందుకు గిరిజన సహకార సంస్థ-జీసీసీ తోడ్పడుతుంది. కార్పొరేషన్‌లో 300 మంది సిబ్బంది పని చేస్తున్నారు. వీరందరినీ భాగస్వాములను చేస్తూ వినూత్న పద్ధతుల్లో గిరిజనులకు ఉపాధి కల్పించే అవకాశం ఉంటుంది. కానీ కాంగ్రెస్ ఏడాది పాలనలో జీసీసీకి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో కార్యకలాపాలు నిలిచిపోయాయని గిరిజన సంఘాల నేతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నిధులు కేటాయించాలని జీసీసీ అధికారులు పలుసార్లు ప్రభుత్వాన్ని సంప్రదించినా ఫలితం లేదని చెప్తున్నారు. ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా తామేమీ చేయలేకపోతున్నామని కొందరు అధికారులు గిరిజన సంఘాల నేతలకు స్పష్టంచేస్తున్నారు. దీంతో కార్పొరేషన్ మనుగడ ప్రశ్నార్థకమైంది.

### నిధులు కేటాయించని నిర్లక్ష్యం

నిధులు లేకపోవడంతో జీసీసీ కార్యకలాపాలు నిలిచిపోయాయని గిరిజన సంఘాల నేతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కార్పొరేషన్ మనుగడ సాగాలంటే కనీసం 30 కోట్ల నిధులు అవసరముందని అధికారులు చెప్తున్నారు. ఈ డిమాండ్‌పై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని అంటున్నారు. కనీసం కొత్త బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తారన్న ఆశతో మరోసారి జీసీసీ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నది. వీటిని ప్రభుత్వానికి పంపుతామని అధికారులు తెలిపారు.

### ఇబ్బంది పడుతున్న సిబ్బంది

ఏడాదిగా అటవీ ప్రాంతాల నుంచి ఉత్పత్తుల సేకరణ దాదాపు నిలిచిపోయింది. కేవలం సబ్బులు తయారు చేయడం చేసే ప్రక్రియ ఒక్కటే నడుస్తున్నది. ఆ సబ్బులను కూడా మార్కెట్‌లో విక్రయించడం లేదు. కేవలం ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు. ఆదాయం కూడా స్వల్పంగానే వస్తున్నది. జీసీసీలోని దాదాపు 300 సిబ్బందికి జీతాలు ఇవ్వడానికి కూడా నిధులు లేవని అధికారులు వాపోతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకుని, జీసీసీ సమస్య పరిష్కరించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. జీసీసీ మనుగడ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని కోరుతున్నారు.

# ఉద్రిక్తంగా డంపింగ్‌యార్డు ముట్టడి

- రైతులు, మహిళలను అడ్డుకున్న పోలీసులు
- నల్లవల్లిలో అర్ధనగ్న ప్రదర్శనలు
- గుమ్మడిదలలో రిలే దీక్షలో మైనార్టీలు
- బొంతపల్లిలో ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో.. గుమ్మడిదలలో ఆటోలతో ర్యాలీ



ప్యారానగర్ డంపింగ్‌యార్డు ముట్టడికి వెళ్తున్న మహిళలు, రైతు జేఏసీ నాయకులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 15: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ అటవీ ప్రాంతంలో జీహెచ్‌ఎంసీ డంపింగ్‌యార్డు ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ గత కొన్నిరోజులుగా ఆందోళనలు ఉధృతంగా సాగుతున్నాయి. శనివారం బాధిత గ్రామాల్లో నిరసనలు చేపట్టారు. ప్రజలు, రైతులు, మహిళా సంఘాల వారు గుమ్మడిదలలో ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. రైతు జేఏసీ, మహిళా సంఘాలు ఎన్‌హెచ్‌పై ర్యాలీగా డంపింగ్ యార్డు ముట్టడికి వెళ్తుండగా మార్గమధ్యంలో వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో ఇరువర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకున్నది. మహిళలను అడ్డుకోవడానికి మహిళా పోలీసులు లేకపోవడం గమనార్హం. గుమ్మడిదలలో 5వ రోజు రిలే దీక్షలో మైనార్టీలు కూర్చున్నారు. రైతు జేఏసీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వందల సంఖ్యలో ఆటోలతో జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. గుమ్మడిదల నుంచి దోమడుగు వరకు ర్యాలీ నిర్వహించారు. నల్లవల్లిలో కొనసాగుతున్న 11వ రోజు రిలే దీక్షలో గ్రామ జేఏసీ నాయకులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. బొంతపల్లిలో రైతు జేఏసీ నాయకులు నాగేందర్‌గౌడ్, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, సద్ది జయభాస్కర్‌రెడ్డి, రాజు, గ్యారల మల్లేశ్, సుంకరిశంకర్, సంజీవరెడ్డి, జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎద్దులబండ్లపై గ్రామాల్లో ర్యాలీ నిర్వహించిన అనంతరం ఎన్‌హెచ్‌పై టోల్‌ప్లాజా వరకు ప్రదర్శనగా వెళ్లారు. రైతు జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఇప్పటికే పారిశ్రామిక కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న తాము డంపింగ్‌యార్డు వస్తే బతుకులు ఆగమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి పరిశ్రమల కాలుష్యం అక్కడ డంపింగ్‌యార్డు వ్యర్థాల వల్ల వచ్చే కాలుష్యంతో భూగర్భజలాలు కలుషితమై భూములున్నా పంటలు సాగుచేయలేని దుస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. 11 రోజులుగా నిరసనలు చేస్తున్నా సర్కారు మొద్దునిద్రలో ఉండటం సరికాదని హెచ్చరించారు. వెంటనే డంపింగ్‌యార్డు అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## కార్మికుల సమ్మె విచ్ఛిన్నానికి కుట్రలు

కార్మికులకు ఫోన్లు చేసి అధికారుల బెదిరింపులు

యాజమాన్య తీరుపై ఆర్టీసీ జేఏసీ చైర్మన్ వెంకన్న ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ కార్మికుల సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈ వెంకన్న ఆరోపించారు. సమ్మె చేయడానికి తేదీని ప్రకటించిన నేపథ్యంలో కార్మికులను సమాయత్తపరిచేందుకు డిపోలవారీగా సమావేశాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్మికులు సమావేశాలకు హాజరుకావద్దని అధికారులు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని తెలిపారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సమ్మె తేదీ సమీపిస్తున్నందున కార్మికులను విచ్ఛిన్నం చేయాలని చర్చల పేరుతో కార్మికశాఖను ప్రభుత్వం రంగంలోకి దింపిందని పేర్కొన్నారు. ఆర్టీసీ యాజమాన్యం ఎన్నికల కోడ్ పేరుతో చర్చలకు రాకపోవడంతో కార్మికశాఖ చర్చలను వాయిదా వేసిందని తెలిపారు. ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులు సీఈసీని కలిసి ఎన్నికల కోడ్ నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని కోరామని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల మధ్య విభేదాలు సృష్టించాలని ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్లు, కండక్టర్లకు శిక్షణ పేరుతో ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసిందని ఆక్షేపించారు. సమ్మె విచ్ఛిన్నం కోసమే వారాంతపు సెలవుల్లో ఉన్న సిబ్బందికి కూడా శిక్షణ ఏర్పాటు చేశారని ఆరోపించారు. సమావేశంలో వైస్ చైర్మన్ ఎన్ థామస్‌రెడ్డి, కో కన్వీనర్లు పాల్గొన్నారు.




హిమాయత్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో జేఏసీ నేతలు, ఆటోడ్రైవర్లు

# సర్కారుపై భగ్గుమన్న ఆటోడ్రైవర్లు

- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, ర్యాలీలు
- ఆర్థిక సాయం ఎప్పుడిస్తారని నిలదీత
- 960 కోట్లు బకాయి పడ్డారని వెల్లడి
- సీఎం ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరిక

హైదరాబాద్ సిటీబ్యూరో/హిమాయత్‌నగర్/కొణిజర్ల/మునగాల ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): ఆటో డ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ఏడాదికి 12వేలు ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తమ జీవితాలను నట్టేట ముంచిందని ఆటోడ్రైవర్లు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, నిరసన ర్యాలీలు నిర్వహించారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో ఆటోడ్రైవర్ల జేఏసీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. బీఆర్‌టీయూ, ఏఐటీయూసీ, టీయూసీఐ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ తదితర సంఘాల నాయకులు, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకోవాల్సిన దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ హామీ మేరకు 8 లక్షలమంది ఆటో డ్రైవర్లకు 12వేల చొప్పున మొత్తం 960 కోట్లు ప్రభుత్వం బకాయి పడిందని తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే సీఎం రేవంత్ ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరిస్తామంటూ మాటతప్పడం మంత్రి పొన్నం అలవాటుగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తీగలబంజరలో పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో దహనం చేశారు. సూర్యాపేట జిల్లా మునగాలలోని గణపవరం ఎక్స్ రోడ్డులో ఆటోయూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

### ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ఆటో కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. హామీలు నెరవేర్చేవరకు మా పోరాటం కొనసాగుతుంది. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆటోకార్మికులకు బడ్జెట్ కేటాయించాలి. ఆత్మహత్య చేసుకున్న ఆటోడ్రైవర్ల కుటుంబాలను సీఎం రేవంత్ ఆదుకోవాలి. 10 లక్షల ప్రమాద బీమా కల్పించాలి. 50 ఏండ్లు నిండిన ఆటోడ్రైవర్లకు పింఛన్లు మంజూరు చేయాలి.

- మారయ్య, బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు

## పేదల సేవకు కదులుదాం

మొదటిపేజీ తరువాయి...

రోగులకు, బస్తీల్లో పేదలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేయాలని సూచించారు. వాడవాడలా అన్నదాన కార్యక్రమాలు చేయాలని, నిరుపేదలకు నిత్యావసరాలు అందజేయాలని కోరారు. గులాబీ సైనికులు ఊరూరా, వాడవాడలా విరివిగా మొక్కలు నాటి హరిత ప్రేమికుడికి అకుపచ్చని కానుక ఇవ్వాలని పిలుపునిచ్చారు. దివ్యాంగులు, నిస్సహాయులకు ఇతోధికంగా సాయమందించాలని విజ్ఞప్తి చేశారు.



లండన్‌లో 'గ్రీన్ ఇండియా చాలెంజ్- వృక్షార్చన' పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎన్నారై బీఆర్ఎస్, టాక్ నాయకులు

## మొక్కలు నాటి.. కేసీఆర్‌కు కానుక ఇద్దాం

లండన్‌లో 'వృక్షార్చన' పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా నవీన్‌రెడ్డి పిలుపు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ పిలుపు మేరకు లండన్‌లో గ్రీన్ ఇండియా చాలెంజ్ పోస్టర్‌ను తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్ (టాక్) నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టాక్ నాయకుడు నవీన్‌రెడ్డి మాట్లాడుతూ సంతోష్‌కుమార్ చేస్తున్న వృక్ష మహాయజ్ఞంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఖండాంతరాల్లో నివసిస్తున్న ఎన్నారైలందరూ ఈనెల 17న జరిగే వృక్షార్చన కార్యక్రమంలో పాల్గొని కేసీఆర్‌కు పుట్టినరోజు కానుకను ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎన్నారై యూకే, టాక్ నేతలు సుప్రజ, రవి రేతినేని, రవి పులుసు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్సీకి కామన్ సిలబస్

ఉన్నత విద్యామండలి నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని బీఎస్సీ డిగ్రీ కోర్సుకు కామన్ సిలబస్ రూపొందించాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. శనివారం మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో సైన్స్ కోర్సుల బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అన్ని వర్సిటీలకు ఒకే తరహా సిలబస్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఇక బీఎస్సీ సైన్స్ కోర్సుల్లో 6 సెమిస్టర్లు ఉండగా, సెమిస్టర్‌కు 25 క్రెడిట్ల చొప్పున 150 క్రెడిట్లు ఉంటాయి. సెమినార్‌కు ఇది వరకు రెండు క్రెడిట్లు ఉండగా, తాజాగా ఒక క్రెడిట్‌కు పరిమితం చేశారు. ప్రాజెక్ట్/ఇంటర్న్‌షిప్‌కు ఇది వరకు నాలుగు క్రెడిట్లు ఉండగా, తాజాగా ఐదు క్రెడిట్లకు పెంచారు. ఈ కోర్సులలో 60 సీట్లకు పరిమితి విధించారు. 2025-26 విద్యాసంవత్సరం నుంచి ఈ కొత్త విధానం అమల్లోకి వస్తుంది. అయితే బీఎస్సీ సైన్స్ బోర్డ్ ఆఫ్ స్టడీస్(బీవోఎస్) కమిటీలో ఇండస్ట్రీ, ఆర్అండ్‌డీ పరిశోధన సంస్థ, కాలేజీయేట్ కమిషనరేట్ ప్రతినిధి సభ్యులుగా ఉంటారు.

## ప్రజాపాలన దరఖాస్తులపై ఇంటెలిజెన్స్ ఆరా

గంగాధర, ఫిబ్రవరి 15 : కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రంలో ఓ జిరాక్స్ సెంటర్‌లో కాసారం గ్రామానికి చెందిన ప్రజాపాలన దరఖాస్తులు దర్శనమిచ్చిన వార్త మూడు రోజుల క్రితం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఇంటెలిజెన్స్ అధికారులు శనివారం ఆరా తీశారు. దరఖాస్తులు జిరాక్స్ సెంటర్‌లోకి ఎలా వచ్చాయి?, వాటిని ఎవరు తీసుకువచ్చారు? అన్న విషయాలపై జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు, రెవెన్యూ సిబ్బందిని విచారించినట్టు ఇంటెలిజెన్స్ అధికారి ప్రకాశ్ పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచే దరఖాస్తులు జిరాక్స్ సెంటర్‌కు తీసుకువచ్చినట్టు తెలిసిందని చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో మ్యాన్ పవర్ తక్కువగా ఉండడంలో జిరాక్స్ సెంటర్‌కు పంపించినట్టు రెవెన్యూ సిబ్బంది వివరించినట్టు పేర్కొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

మైనింగ్ శాఖ కార్యదర్శి శ్రీధర్

ముత్తారం, ఫిబ్రవరి 15: ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టవేయాలని మైనింగ్ శాఖ కార్యదర్శి ఎన్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి, జిల్లెలపల్లి గ్రామాల్లోని ఇసుక రీచ్‌లను టీజీఎండీసీ వైస్ చైర్మన్ బీఆర్వీ సుశీల్ కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు తక్కువ ఇసుక అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇసుక రవాణా చేసే వాహనాలకు ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని తెలిపారు.